# మధుర భావన - 10

ఆ రాత్రి తీరుబడిగా ఉన్నపుడు వంశీ సుమజకి ఫోను చేసాడు. ఉత్తరానికి చిన్న జవాబు రాసేసినా గానీ తనతో మాట్లాడాలనిపించి ఫోను చేసానని చెప్పాడు.

‘‘సమస్య సమసిపోయినట్లుంది... గొంతులో హుషారు తెలుస్తోంది...!’’ చిరునవ్వుతో అంది సుమజ.

‘‘సమస్య తీరిపోవటం నిజమే గానీ... నా హుషారుకి కారణం మాత్రం నువ్వే...!” అన్నాడు వంశీ.

‘‘సమస్య ఎలా... తీరిపోయిందీ...?’’

‘‘నీ సహకారం వలనే...!’’

‘‘చిత్రంగా ఉందే... నాకు తెలియకుండానే నేనేం చేశానూ...?’’

‘‘ప్రత్యక్షంగా నువ్వేమీ చేయలేదుగానీ... పరోక్షంగా... నీ మాటల ప్రభావం వలనే జరిగిందని నేననుకుంటున్నా...!’’

‘‘నా మాటల వలనా...?! అయితే... అది... మీ మధురభావన మహిమ...!’’ సుమజ సరదాగా నవ్వింది!

‘‘ఆ మాట మా నాన్న మాకు ఉపదేశించిన తారకమంత్రం ! మనసంతా మంచి ఆలోచనలతో నిండివుంటే... మనల్ని సమస్యలనేవి వేధించవు !’’

‘‘అందుకేగా... మీ కిష్టమైన ఆ పాటలోని ఆ వాక్యంతో మొదలుపెట్టి చివరగా కూడా దానితోనే ముగించానూ...! ఆ పాటలోని గొప్పతనం... కవిగారు ‘మనము’ అనే మాటని ‘మనసు’, ‘ఇద్దరం’ అనే రెండు అర్థాలూ వచ్చేట్లుగా చక్కగా ఉపయోగించారు కదూ...?’’

‘‘అవును... అందుకేనేమో... ఆ చరణం ఎపుడూ నా మనసులో మోగుతూనే ఉంటుంది...!”

సుమజ నవ్వింది. ‘‘మీ అలవాటు నాకూ అంటించారు...! నా మనసులోనూ ఎపుడూ ‘మధురభావ లహరిలో’ అనే ఆలాపనే...!’’

‘‘అవునా...’’ అంటూ వంశీ కూడా హాయిగా నవ్వాడు.

* * *

వంశీ తల్లికి ‘గుడ్ నైట్’ చెప్పి, పడుకుందామనుకుని ఆమె గదిలోకి వెళ్ళాడు. ఆవిడ ఉలిక్కిపడినట్లుగా చటుక్కున చేతిలోని పుస్తకంలో బుక్ మార్క్ పెట్టి దానిని పక్కన పెట్టేస్తూ సరేనన్నట్లుగా తలవూపింది.

‘‘ఏమిటమ్మా... ఈ సమయంలో చదువుతున్నావూ...?’’ అని గది గుమ్మం దగ్గరే నిలబడి వంశీ అడిగిన ప్రశ్నకి ఆవిడ ‘‘ఏం లేదులేరా... కథల పుస్తకం... నా ఫ్రెండు ఒకావిడ ఇస్తేనూ.. అది చదువుతున్నా...!’’ అని జవాబు చెప్పింది.

‘‘సరే... అమ్మా... నేనిక పడుకుంటానూ’’ అని చెప్పి వంశీ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

* * *

ఆ రోజు... బయటకు వెళ్ళి వచ్చిన వంశీని చూసి శ్యామసుందరి ‘‘ఎవరండీ...? మీరు... మా అబ్బాయికోసం వచ్చారా...? ఇంట్లో వాడు లేడండీ... బయటకు వెళ్ళాడూ..’’ అని చెప్పింది.

వంశీ నవ్వు మొహంతో ‘‘సరేనండీ... వచ్చేవరకూ కూర్చుంటానూ...’’ అంటూ ముందు గదిలోనే కూర్చున్నాడు.

దానికి తల్లి ఏమి మాట్లాడకపోవటం చూసి వంశీ ‘‘తమాషా చాలుగానీ... అమ్మా, ఇక భోజనం చేసేద్దామా?’’ అనడిగాడు.

ఆ మాటకి శ్యామసుందరి అతనివైపు వింతగా చూసింది. ‘‘మీరు... ఎవరు బాబూ.. నాకు గుర్తు రావటం లేదూ...!’’ అంది.

వంశీ ఫక్కున నవ్వాడు.

‘‘ఎవరు... అని అడుగుతావేమిటి అమ్మా... నేను శ్యామసుందరి గారి అబ్బాయిని...’’ అన్నాడు. ఆవిడ వంశీ వైపు నిశితంగా చూసింది. ఇంకో క్షణం పట్టి పట్టి చూసింది.

వంశీ మామూలుగా చూసి ''ఏమిటమ్మా... సరదాకి ఏదో మాట్లాడినాగానీ ఇలా... ఇంకెంత సేపూ...?'' కొంచెం అసహనంగా అనేసరికి ఆవిడ ఆశ్చర్యంగా చూసింది. ''చెప్పానుగా... మా అబ్బాయి ఇంట్లోలేడు... బయటకు వెళ్ళాడనీ...'' అంది నసుగుతూ.

తమాషా కాదని అప్పటికి వంశీకి అర్థమైంది. అయితే తల్లి ఎందుకలా మాట్లాడుతుందో అతని ఆలోచనకు అందలేదు. విచిత్రంగా చూస్తుండిపోయాడు.

ఆవిడ ధోరణి అలాగే కొనసాగేటప్పటికి వంశీలో కంగారు పెరిగింది. తనని తల్లి నిజంగానే గుర్తు పట్టటం లేదనుకోగానే దుఃఖం పెల్లుబికింది! తనకి తెలిసిన డాక్టరుకు ఫోను చేసి విషయం చెప్పాడు. ఆయనకూ కేసూ విషయం సరిగా అర్థంకాలేదు. ఆయన మాటమీద ఆవిడను డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాడు. శ్యామసుందరి మొదట అంగీకరించలేదు. కానీ ''మీ అబ్బాయి తన దగ్గరకు మిమ్మల్ని తీసుకురమ్మన్నాడు'' అని చెప్పగానే ఏమనకుండా వంశీ వెంట హాస్పటల్ కు వెళ్ళింది.

ఆ డాక్టరు సూచనపై వంశీ తల్లిని ఊళ్ళో ప్రసిద్ధిగాంచిన సైక్రియాట్రిస్టు దగ్గరకు తీసుకువెళ్ళాడు.

అన్ని పరీక్షలూ చేసాక ఆల్జీమర్స్ కూడా కాదని తేల్చారు.... కొన్నాళ్ళు ఆమె పరిస్థితిని గమనించి చూడమని ఆ సైక్రియాట్రిస్టు వంశీకి చెప్పటం జరిగింది.

వంశీ ఉత్తరం అందగానే సుమజ వంశీకి ఫోను చేసింది.

''ఏమిటి వంశీ, అంత పొడుపుగా రాసారూ... మరీ చిన్నదైనా... నన్ను మధురభావనల ఊయలెక్కించి ఊపేసింది...'' తమాషాగా నవ్వి అపుడే ఏదో గ్రహించినట్లుగా మళ్ళీ అంది ''ఏమిటో... మీలో హుషారేం లేదూ....మళ్ళీ ఏదైనా సమస్యా...?'' అనడిగింది.

''అవును...'' అంటూ వంశీ నిట్టూర్చేసేసరికి సుమజ ఆతృతగా... ''నిజమా... ఏమిటదీ...?'' అంది.

''సరిగ్గా చెప్పలేకపోతున్నాను... మనసు అదో మాదిరిగా ఉంది! అమ్మ పరిస్థితి విచిత్రంగా ఉంది! నన్నే గుర్తు పట్టటం లేదు... కొందరు వ్యక్తులు, కొన్ని సంఘటనలు మాత్రం గుర్తు ఉంటున్నాయి...!'' వంశీ గొంతు బొంగురుపోయింది.

''నిజమా...?! మరీ ఆశ్చర్యంగా ఉంది... ఇదేమిటిలా జరిగిందీ...? నేను... రానా...?'' నిర్ఘాంతపోతూ అడిగింది.

‘‘వచ్చి... నువ్వేం చేయగలవు సుమజా... సరే... మళ్ళీ మనసు ప్రశాంతంగా ఉన్నపుడు చేస్తా...! ఇపుడిక ఏం మాట్లాడలేకపోతున్నా...’’ అంటూ వంశీ ఫోన్ ఆపేశాడు.

అపుడే అనూష వంశీకి ఫోను చేసింది. మొదలు పెట్టటమే దూకుడుగా ఉంది ఆమె స్వరం. ‘‘ఇదేమిటి అన్నయ్య... అమ్మకి ఫోను చేస్తే... నేనెవరో ఏమిటో తెలియనట్లుగా మాట్లాడిందీ...?’’

‘‘అవును అనూ... అమ్మ పరిస్థితి నాకూ చిత్రంగా ఉంది! డాక్టర్లకు చూపిస్తున్నా. కొన్నాళ్ళు వేచి చూడమంటున్నారు..’’ విచారంగా అన్నాడు వంశీ.

‘‘అసలు ఇది అనే కాదు...ఈ మధ్య... అమ్మ ధోరణి నాకేం అంతు పట్టడం లేదు... ఇపుడేదో రోగం వచ్చిందనుకుందాం... కానీ... అంతకు ముందు కూడా నేనడిగినది ఇవ్వటానికి తనకే ఇష్టం లేనట్లుగా మాట్లాడింది. అది చాలా విచిత్రంగా ఉంది! ఎవరైనా... తన పేరనున్నది ఆడపిల్లలకు ఇష్టంగా ఇస్తారు... మగవాడికి ఇవ్వాలనుకోరు! కానీ... అమ్మ పద్ధతి ఏమిటిలా తారుమారుగా ఉందీ...?’’

‘‘అనూ... ఈ సమయంలో ఆస్తిపాస్తుల పంపకాలు... ఇవ్వటాలు గురించి ఎందుకూ మాట్లాడుకోవటం... ముందు అమ్మ ఆరోగ్యం మనకి ముఖ్యం కదా... కొంచెం అమ్మ ఆరోగ్యం కుదుటపడగానే, నువ్వడిగింది ఇవ్వటం జరుగుతుందిలే!’’ అన్నాడు వంశీ.

అనూషలో అసహనం పెరిగింది.

‘‘నువ్వలాకాక ఇంకేమంటావులే... అమ్మ ఆరోగ్యమే ముఖ్యం... అంతేగానీ నాకు మీరిద్దరూ ఇచ్చిన మాట మాత్రం ఇపుడు కాదు... ఎప్పటికో అంటున్నావు! నువ్వు నాకు నిజంగా స్వంత అన్నయ్యావి అయితే ఇలా మాట్లాడేవాడివా...?’’

ఆ తీవ్ర నేరారోపణకి వంశీ దిమ్మెరపోయాడు! అతని మొహం వెలవెలబోయింది. దుఃఖావేశం వచ్చేసింది ‘‘ఏమిటి అనూ.. అలా అంటున్నావు... నేను... స్వంత అన్నయ్యని కాననీ... అందుకే... అమ్మ ఆరోగ్యం ముఖ్యమంటూ తప్పించుకుంటున్నానా... నిజంగానే అంటున్నావా?’’

మాటలు కూడా దుఃఖంతో తడబడ్డాయి.

అనూ వ్యంగ్యంగా అంది ‘‘మారుటి చెల్లి పట్ల ఏమాత్రం ఆపేక్షలేనివాడివి స్వంత తల్లిలా మా అమ్మని అభిమానిస్తున్నావని ఎలా అనుకోమంటావు...?’’

‘‘అనూ.... అనూ... అలా మాట్లాడకు... నేను తట్టుకోలేకపోతున్నాను...!’’ వంశీ అభ్యర్థనను లక్ష్యపెట్టకుండా అనూష తీవ్ర స్వరంతో ‘‘నేనన్నదాంట్లో అంతగా నువ్వు బాధపడాల్సిన అవసరం లేదు... తీరిగ్గా ఆలోచించు... నీకే అర్థమౌతుంది!” అంటూ ఫోన్ ఆపేసింది.

వంశీ దిగులుగా తల పట్టుకుని కూర్చుండిపోయాడు!

‘ఏమంది అనూ... తీరిగ్గా ఆలోచించాలా... తను చేసి ఆరోపణలన్నీ అసత్యాలు కాదా... నిజాలేనా...?! తల్లీ, చెల్లీ పట్ల తనకున్న ప్రేమాభిమానాలన్నీ ఉత్తవేనా...?!’ అతనికి మతిపోయినట్లుగా ఉంది!

* * *

‘ఇదేమిటసలు... ఇలా జరిగిందీ... అమ్మ నన్ను గుర్తుపట్టకపోవటమమిటి...?’ ఆశ్చర్యం, విచారం చుట్టుముట్టగా... అయోమయంగా ఉండిపోయిన వంశీకి చటుక్కున తన స్నేహితుడు ధనుంజయ గుర్తుకు వచ్చాడు. ధనుంజయ పై చదువులకోసం విదేశాలకు వెళ్లాడు. అతని తండ్రి పేరున్న సైకియాట్రిస్టు... ఆ ఊళ్ళోనే ప్రాక్టీసు చేస్తున్నారు. ఈ విషయం గుర్తుకు వచ్చిన వెంటనే ఆయన ఫోను నెంబరు సంపాదించి ఫోను చేసి... తనను పరిచయం చేసుకుని తల్లి పరిస్థితి వివరించాడు వంశీ.

ధనుంజయ తండ్రి కరుణాకరంగారు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్తూ.. ‘‘అందర్నీ కాదు... కొందర్నే అమ్మ మర్చిపోయినట్లుగా అనిపిస్తోంది. రోజూ వచ్చి పనులన్నీ చేసి పెట్టే పార్వతిని మర్చిపోలేదు. బాగానే పలుకరించింది. అలాగే కొన్ని వస్తువులు ఎక్కడ ఉన్నాయో గుర్తులేదంటూ, జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తూ వుంటుంది. ఒక్కోసారి గుర్తుకు వస్తాయికూడా. కొన్ని విషయాలు ఎప్పటివో గుర్తున్నాయంటుంది. ఈ మధ్యవి కొన్ని మర్చిపోతుంది. నేను కాకుండా తన కొడుకు వేరెవరో అనుకుంటూ బయటకు వెళ్ళాడంటుంది! ఎదురుగా వున్న నన్ను గుర్తుపట్టడం లేదు డాక్టర్... ఇదే... నన్నెక్కువ క్రుంగదీస్తోంది...!’’

డాక్టరు కరుణాకరం గారు అన్ని వివరాలు తెలుసుకుని సమస్య అంత తీవ్రమైంది కాదు కాబట్టి, కొన్నాళ్ళలోనే తగ్గిపోవచ్చని భరోసా ఇచ్చారు. తన దగ్గరకు ఆమెను తీసుకురమ్మనీ చెప్పారు.

ఆవిడను ఒంటరిగా కూర్చోబెట్టుకుని ఎన్నో విషయాలు మాట్లాడిన డాక్టరు చివరకు ఒక సూచన చేశారు.

‘‘ఆమెను ప్రతీక్షణం కనిపెట్టుకుని ఉంటూ కాలక్షేపం కబుర్లు చెబుతూ ఉండేవాళ్ళు తోడుగా ఉండటం బావుంటుంది. దీనికి నా శ్రీమతి శారద సరిపోతుంది. నేను వైద్య పరంగా సహాయం చేస్తుంటాను. మెడిసిన్ చదువుతున్న నా మనవరాలు తనూజ నా సూచనల ప్రకారం.. తను ఇంట్లో వున్న వేళల్లో బి.పి. చూడటం లాంటివన్నీ చూస్తూ ఆమె పరిస్థితిని గమనిస్తూ ఉంటుంది. సాధారణంగా నేను పేషంట్స్ ను చూసి సలహాలిచ్చి పంపించేస్తుంటాను. అయితే మీ అమ్మగారిని మాత్రం మా ఇంట్లోని ఒక బెడ్ రూములో ఉంచుతాను!’’ అని డాక్టరుగారు అడిగేసరికి వంశీ గత్యంతరం లేక అంగీకరించాడు.

ఏ విధంగానైనా తొందరలో తన తల్లి మామూలు ఆరోగ్యవంతురాలు కావటమే తనకి ముఖ్యం అని సరిపెట్టుకున్నాడు వంశీ.

డాక్టరు గారు ముందుగదిలో క్లినిక్ నడుపుతూంటారు. వెనకగా ఉన్న గదుల్లోనే వారి నివాసం. మనవరాలు తనూజ వీళ్ళ దగ్గిరే ఉండి మెడిసిన్ చదువుతున్నది. వాళ్ళ అబ్బాయికి స్నేహితుడైన వంశీ పట్ల ఆయనకు ప్రత్యేకమైన అభిమానం ఉంది...అందుకే ఇలాంటి సలహా ఇవ్వటం జరిగింది.

ఆ మరునాడే వంశీ, తల్లి వస్తువులు.. బట్టలు అన్నిటితో డాక్టరుగారి ఇంటికి ఆమె మకాం మార్చాడు. ప్రతిరోజూ వచ్చి తల్లి ఆరోగ్య పరిస్థితిని గమనించి చూడవచ్చని డాక్టరు చెప్పటంతో వంశీ స్థిమితపడ్డాడు.

తల్లికి భోజనం తమ ఇంటి దగ్గర నుండే తమ ఇంట్లో వంటపని చేసే పార్వతి సాయంతో ప్రత్యేకంగా చేయించి తీసుకువస్తానని వంశీ చెప్పినపుడు డాక్టరు దంపతులు, ఒక్క మనిషే కాబట్టి... ఆమెకు తమతో పాటే భోజన సదుపాయాలన్నీ చూస్తామని చెబుతూ వంశీ ప్రతిపాదనని సున్నితంగా తరిక్కరించారు.

ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోయాయి.

తల్లి లేకుండా ఒంటరిగా ఇంట్లో ఉండాల్సి రావటం వంశీకి బాధ కలిగించినా, తట్టుకుని తొందరగా తల్లి ఇంటికి రాగలగాలని మనసులోనే మౌనంగా ప్రార్ధనలు చేశాడు.

నాలుగురోజుల తర్వాత అనూష వాళ్ళ ఆయన, అత్తగారితో తల్లిని చూడటానికి వచ్చింది.

వచ్చీ రాగానే అనూష వంశీని నిష్ఠూరంగా నిలదీసింది. దిక్కూమొక్కూ లేనట్లుగా అమ్మను ఎవరో ఇంట్లో అలా వదిలేయటమేమిటంటూ నిందా వాక్యాలు పలికింది.

డాక్టరుగారు సూచననుసరించి ఆయన ప్రత్యేకమైన ఆదరణతో చూస్తానని ఇచ్చిన హామీ మేరకు అలా చేయటమే బావుంటుందని తనకు తోచిందని వంశీ చెప్పి, అనూష తన ఊరుకు తల్లిని తీసుకెళ్ళి వైద్య సహాయం చేస్తానంటే తనకేం అభ్యంతరం లేదనీ చెప్పాడు. దాంతో అనూష మరో మాట మాట్లాడకుండా మౌనం వహించింది.

ముందుగా అనూష భర్తా, అత్తగారూ కరుణాకరం గారి హాస్పటల్ కి వెళ్ళి... వెనకగా వున్న వాళ్ళ ఇంటి బెడ్ రూములో విశ్రాంతి తీసుకుంటున్న శ్యామసుందరిని చూసి వచ్చారు.

తాము చెప్పిన మాటలన్నీ విన్నట్లే అనిపించిందని వాళ్ళు అన్నారు. ఆమె మనసుకేదో దెబ్బ తగటలం వలన అలా జరిగివుండొచ్చని డాక్టరుగారు అన్నారని వాళ్ళు చెప్పగానే అనూష ఆ మాటలకు ఆశ్చర్యం చూపించింది.

'మానసిక ఆరోగ్యం చెడిపోయేంతగా అమ్మ మనసుకు  ఏం బాధ కలిగివుంటుందీ' అని అనూష వంశీని అడిగింది. ''అదే తెలియటం లేదు''అని వంశీ అనగానే అనూష ''నీకు తెలిసే ఉంటుంది... మా దగ్గర దాస్తున్నావు...'' అంటూ విరుచుకు పడింది.

ఆ ఆరోపణకి వంశీ చిన్నబోయాడు. తలవంచుకున్నాడు.